క్లుప్తంగా

చిన్నారులకు ఆర్థిక సాయం



నెల్లూరు (టౌన్) : స్థానిక పెద్దబజారులోని షేక్ మునీల్ ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను చదివించేందుకు కష్టతరం కావడంతో అక్షయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. స్థానిక విశ్వోదయ స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఫీజులు, పుస్తకాలు, పరీక్ష ఫీజు నిమిత్తం స్కూల్ కరస్పాండెంట్‌కు రు.28 వేల చెక్కును అందజేశారు. ఫౌండేషన్ కోశాధికారి సతీష్, సభ్యులు అల్తాఫ్, ఆజం, ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

'జనహిత- వాత్సల్య'కు రూ.50 వేల విరాళం



నెల్లూరు(బృందావనం) : స్థానిక కొండాయపాళెం రోడ్డులోని జనహిత-వాత్సల్య బాలల, వృద్ధుల ఆశ్రమానికి ప్రవాస భారతీయురాలు నాపా బిందుభారతి, కాకాణి చంద్రశేఖర్ దంపతులు రూ.50 వేల విరాళాన్ని అందజేసినట్లు ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో పి.ఇంద్రసేనానాయుడు, కేంద్ర సహాయ కార్యదర్శి టీవీఎస్ దుర్గాప్రసాద్, పాఠశాల హెచ్ఎం ఎం.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్ : రూరల్ నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి సీఎం సహాయనిధి చెక్కులను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అందించారు. వెల్లంటి గ్రామానికి చెందిన జువ్వల వెంకమ్మకు రూ.80 వేలు, 21వ డివిజన్‌కు చెందిన పసుపులేటి చిన్నకు రూ.40 వేలు, 32వ డివిజన్‌కు చెందిన జబీనాకు రూ.45 వేల చెక్కును నెల్లూరులోని ఆయన కార్యాలయంలో బుధవారం అందజేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, వైఎస్సార్‌సీపీ నేత సీహెచ్ హరిబాబుయాదవ్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



పింఛన్‌కార్డు అందజేస్తున్న గౌరి

నెల్లూరు(బారకాసు) : పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. నగరంలోని 21వ డివిజన్‌లో ఉన్న సచివాలయంలో పింఛన్లు, కాపు నేస్తం, వాహనమిత్ర, వైఎస్సార్ చేయూత వంటి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు సంబంధిత కార్డులను ఆమె బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత, హస్తకళలను ప్రోత్సహిద్దాం

నెల్లూరు(బారకాసు) : చేనేత, హస్తకళలను ప్రోత్సహిద్దామని నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి పిలుపునిచ్చారు. స్థానిక దర్గామిట్టలోని ఎన్‌జీఓ హోమ్‌లో శ్రీకళాదర్శిని హ్యాండ్‌లూం, హ్యాండిక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా మేళాను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పోచంపల్లి, ఉప్పాడ, మంగళగిరి, ధర్మవరం చీరలు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి పొందినట్లు తెలిపారు.

ఆదాలను విమర్శించడం తగదు

నెల్లూరు(మినీబైపాస్) : ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిని ముస్లింల ద్రోహి అని విమర్శించడం సమీకి తగదని వైఎస్సార్‌సీపీ నేత సయ్యద్ నిజాముద్దీన్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముస్లింలంతా తన వైపు ఉన్నారని సమీ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదాల రాజకీయ జీవితంలో ఎవరినైనా ఇబ్బంది పెట్టాడని రుజువు చేయగలవా అని ప్రశ్నించారు. 1999లో అల్లూరు నియోజకవర్గం నుంచి రాజకీయ జీవితం మొదలు పెట్టి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సందర్భంలో ముస్లింపై కేసులు పెట్టించి ఉంటే నిరూపించాలని సవాలు విసిరారు. ముస్లింల మధ్య వివాదాలు సృష్టించే గుణం మంచిది కాదన్నారు. రాబోయే ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో ముస్లింలు ఏకమై ఆదాలకు అండగా నిలిచి ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు సత్తార్, కాంతర్ వల్లీ, ఇస్మాయిల్ ఖాదరి, రియాజ్, కరీముల్లా, అహ్మద్, అలీమ్, ఖలీల్ పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి జీవితం ఆదర్శనీయం



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు



ఆంధ్రకేసరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

- ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి
- ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

నెల్లూరు(క్రైమ్) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీతో పాటు పలువురు పోలీసు అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో ప్రకాశం పంతులు నిర్ణయాత్మక పాత్ర పోషించారన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికి ఎదురెళ్లి ఆంధ్రకేసరిగా చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన త్యాగం, దేశభక్తి, నిరాడంబరత, ప్రజా సంక్షేమ దృష్టిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు శిరీష, గాంధీ, ఆర్ఐలు అంకమరావు, మౌలుద్దీన్, శ్రీనివాసులురెడ్డి, పాల్‌రాజు, ఏఓ విజయకుమార్, జిల్లా పోలీసు కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీలో..

నెల్లూరు(పొగతోట) : నగరంలోని జెడ్పీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ సుస్మితారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తిదాయకం

నెల్లూరు(బారకాసు) : టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మేయర్ స్రవంతి తెలియజేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కలిసి ఆమె ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో టంగుటూరి ప్రకాశం పంతులు అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, మేనేజర్ ఇనాయతుల్లా, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయంలో..

సుబేదారుపేటలోని మెప్మా కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, ఐబీ అంకయ్య, ఎల్‌హెచ్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, హెచ్ఎన్ హర్షిత తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ నేతలు

ఘన నివాళి

నెల్లూరు(బృందావనం) : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఆంధ్రకేసరి విగ్రహానికి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బ్రాహ్మణ సంఘాల నేతలు కురిచేటి లక్ష్మీనారాయణ, జి.నారాయణరావు, ఎస్‌పీఎల్ వరప్రసాదరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్



నివాళులర్పిస్తున్న పీడీ రవీంద్ర



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ స్రవంతి

రీసర్వేతో భూ వివాదాలకు పరిష్కారం



భూ హక్కు పత్రాలను అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : భూముల సమగ్ర రీసర్వేతో ఆస్తులు, పొలాల వివాదాలకు పరిష్కారం లభిస్తుందని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన భూ హక్కు సర్వే పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా గ్రామాల్లో ఇళ్లకు పత్రాలు లేవని, సర్వే నంబర్లు కూడా తెలియకపోవడంతో ఎన్నో వివాదాలు నెలకొన్నాయని, సమగ్ర భూసర్వే ద్వారా వాటికి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఉప్పుటూరు గ్రామంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఈ గ్రామంలో తాగునీటి వసతిని తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి ఇప్పటికే రూ.2.40 కోట్లను మంజూరు చేశామని, మరిన్ని అభివృద్ధి పనులకు రూ.కోటి 80 లక్షలను కేటాయించనున్నట్లు తెలిపారు. అదే విధంగా జెడ్పీ నిధుల నుంచి వాటర్ ట్యాంక్‌ను కూడా మంజూరు చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో చర్చించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, నరసింహకొండ దేవస్థానం చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు హరిబాబు యాదవ్, చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి

- కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు) : వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నగర వ్యాప్తంగా కాలువల్లో పూడిక తీత, మురుగు పారుదల, దోమల వ్యాప్తి నిర్మూలన వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులకు సూచించారు. నెల్లూరు నగరంలోని ఆదిత్యనగర్, రామ్‌జీనగర్, జగదీష్‌నగర్, వేపదొరువు, పద్మావతినగర్, ఎస్‌వీజీఎస్ కళాశాల తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వాహనాల ద్వారా ఇళ్ల నుంచి మాత్రమే సేకరించాలని, వీధుల్లో వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి హెచ్చరించాలన్నారు. భవన నిర్మాణ మెటీరియల్‌ను వీధుల్లో నిల్వ చేయకుండా పర్యవేక్షించాలని, రోడ్లను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, శానిటరీ సూపర్‌వైజర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అర్హులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారులకు కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో రెండు సెషన్లలో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. బీఎల్ఓలు వారికి కేటాయించిన పరిధిలో డోర్‌టుడోర్ సర్వేను కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఒకే డోర్ నంబర్‌పై ఎక్కువ మంది ఓటర్లు నమోదై ఉంటే పూర్తి స్థాయిలో విచారించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈఆర్ఓలు నిర్మలానందబాబు, దేవీకుమారి, దశయ్య, ధనంజయరెడ్డి, శ్రీనివాసులు, ఈడీటీ, సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.



పద్మావతినగర్‌లో శానిటేషన్ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్

డీకేడబ్ల్యూలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



వినయ్‌రామచంద్రన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

నెల్లూరు (టౌన్) : నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ నేవల్ యూనిట్ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 10-ఏ నేవల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ మాట్లాడుతూ డీకేడబ్ల్యూ కళాశాలలో 50 మందితో కూడిన యూనిట్‌ను అనుమతించామన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 35 క్యాడెట్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఆర్మీ యూనిట్ ద్వారా విద్యార్థులకు సేవలు అందిస్తున్నామని, త్వరలో ఎయిర్‌ఫోర్స్ యూనిట్ కోసం ప్రయత్నం చేస్తామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణరావు, ఎన్‌సీసీ కేర్ టేకర్ దివ్య, అధ్యాపకులు ప్రసాద్, చెంచురామయ్య, జోజి, సత్యనారాయణ, నాగరాజు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఆర్ఎం స్కూల్‌లో..

నెల్లూరు (టౌన్) : నగరంలోని ఈఎస్ఆర్ఎం స్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను 10-ఏ నేవల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ వినయ్‌రామచంద్రన్ బుధవారం ప్రారంభించారు. మొత్తం 50 మంది విద్యార్థులకు గానూ 35 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ హరి తదితరులు పాల్గొన్నారు.

మురళీమోహన్‌రాజుకు అవార్డు



నెల్లూరు(బృందావనం) : న్యూఢిల్లీలోని ఆంధ్ర, తెలంగాణ భవన్‌లో శిఖరం ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నెల్లూరుకు చెందిన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు బుధవారం 'ప్రైడ్ ఇండియా నేషనల్ నంది అవార్డు' అందుకున్నారు. మురళీమోహన్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక, సాంస్కృతిక, సాహిత్యసేవలకు గానూ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. దీనిని ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అఖిలేష్ త్రిపాఠి అందజేశారన్నారు. కార్యక్రమంలో ఆదాయపన్ను శాఖ అడిషనల్ కమిషనర్ ఎ.వెంకటరావు, యువ కళావాహిని అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శిఖరం ఆర్ట్స్ ఫౌండర్ గొల్ల కృష్ణ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో పాటలు, నృత్య పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి ఆద్యంతం అలరించాయి. ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు పర్యవేక్షణలో జరిగిన విభావరిలో పలువురు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమ పర్యవేక్షకుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ కళారంగానికి, కళాకారులకు తోడ్పాటు అందించాలన్న ఆశయంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించామన్నారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహకంగా నగదు, జ్ఞాపికలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా తమ వంతుగా సాహిత్య, సామాజిక సేవలందిస్తున్న పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ సమన్వయకర్త నలుబోలు బలరామయ్య నాయుడులను ఘనంగా సత్కరించామన్నారు. అనంతరం శ్రీబాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జరిగిన మ్యూజికల్ నైట్ అలరించింది. ప్రవీణ్‌కుమార్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు ఎ.జయప్రకాష్, షేక్.రియాజ్ బాషా, పి.ప్రదీప్, ఎన్వీ రమణయ్య, ఎస్.సత్యం, ఎం.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



బలరామయ్య నాయుడును సత్కరిస్తున్న నిర్వాహకులు

కేసుల పెండెన్సీని తగ్గించాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఎర్రచందనం కేసుల పెండెన్సీని తగ్గించి నిందితులకు శిక్షలు పడేలా చేయాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎర్రచందనం కేసుల పురోగతిపై ఆయన బుధవారం నెల్లూరులోని తన చాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీర్ఘకాలికంగా కేసుల పెండెన్సీకి గల కారణాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టులతో సరిపెట్టుకోకుండా మూలాల ఏరివేత దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనేక కేసుల్లో దర్యాప్తు అంతంత మాత్రంగానే ఉందని, ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో దర్యాప్తును పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితులకు శిక్షలు పడేలా చేయాలన్నారు. కేసుల పెండెన్సీని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. దిగువ కోర్టుల్లో ఉన్న కేసులను ఎర్రచందనం కోర్టుకు బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీల నుంచి అంతర్జాతీయ స్మగ్లర్ల వరకు శిక్షను పడేలా చేసినప్పుడే ఎర్రచందనం అక్రమరవాణా నియంత్రణ సాధ్యమవుతుందని, ఆ దిశగా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పోలీస్ అధికారులు

కొనసాగిన వేదపారాయణ సప్తాహం

నెల్లూరు(బృందావనం) : శృంగేరి శారదా పీఠ ఉత్తరాధిపతి విధుశేఖర భారతిస్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా పొగతోట గాంధీనగర్‌లో ఇరగవరం వేదపరిషత్ ఆధ్వర్యంలో చక్రాల వారి ట్రస్ట్ పర్యవేక్షణలో వేదపారాయణ సప్తాహం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆరో రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వేదాల ప్రాధాన్యంపై ప్రముఖ వేదపండితులు భట్టారం శ్రీనివాసశాస్త్రి ఉపన్యసించారు. గుళ్లపల్లి శివశర్మ అవధాని ఆధ్వర్యంలో కృష్ణయజుర్వేద పారాయణం చేశారు. పామర్తి యదువంశిక నృత్యప్రదర్శన అలరించింది. దుర్భాకుల సాంబమూర్తి, మాతా గౌరీ శివతేజ స్వామి, పేరేపి పూర్ణచంద్రరావు, జి.వాసుదేవరావు, వి.శ్రీహరిప్రసాదరావు, రామాయణ మణిశంకరశర్మ, మైపాడు రాజా పాల్గొన్నారు.



భట్టారం శ్రీనివాసశాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నేడు వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బారకాసు) : నగరంలోని ఏసీనగర్‌లో బీసీకేసీ కల్యాణ మండపం పక్కన ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి దేవస్థానంలో నేడు 16వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థాన సేవా యూత్ ఆధ్వర్యంలో జరిగే ఆరాధనోత్సవంలో ఉదయం 4 గంటలకు ధునిపూజ, 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, 6 గంటలకు హారతి, ప్రసాద వితరణ తరువాత నిత్య పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు పూజా కార్యక్రమం, రాత్రి 7కు తీర్థప్రసాద వితరణ, రాత్రి 9 గంటలకు నగరోత్సవం జరుగుతుందని వివరించారు. 24న ఉదయం 6 నుంచి 25న ఉదయం 6 వరకు అఖండ సంకీర్తన భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులందరూ పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కళా ప్రదర్శనతో రైతు వికాసం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రైతులకు అందజేసే రుణాలు, పథకాలపై కళా ప్రదర్శన ద్వారా చైతన్య పరిచే కార్యక్రమం డీసీసీబీ చేపట్టింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) రామూర్తినగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం కోడూరుపాడు గ్రామంలో కోదండరామస్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పలు పథకాలు, రుణాలకు సంబంధించిన విషయాలపై కళాకారులు తమదైన శైలిలో ప్రచారం చేశారు. బ్యాంక్ నుంచి రుణాలు పొందడం, తిరిగి వాటిని సులభతరంగా చెల్లించడం, రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకాలపై ప్రదర్శన రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ రామ్మూర్తినగర్ బ్రాంచ్ సూపర్‌వైజర్ బాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ వెంకటేశ్వర్లు, సీఈఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.